# స్వదేశాగమనము

ఆ రోజు దేశ్ చాలా సంతోషంగా ఉన్నాడు. అయిదు సంవత్సరాల తర్వాత మాతృభూమి మహాభారత్‌కి ఆ సాయంత్రమే ప్రయాణం.

"ఇన్ని సంవత్సరాల నీ కృషి ఫలితంగా కాలి బొటన వ్రేలి మీద కాస్తంత జల్లుకొంటే, దోమల బాధా, ఈగల బాధా లేకుండా హాయిగా నిద్రపోయే ఈ 'స్ప్రే' మన లేబ్ కనిపెట్టగలిగింది. హాయిగా ఓ నెల రోజులు మీ దేశంలో గడిపి, మీ వాళ్ళనందర్నీ కలుసుకొని రా. ఈ లోపుగా

ఈ స్ప్రేకి పేటెంట్ వగైరాలు, సిద్ధం చేసి ఉంచుతాం" అన్న విలియం మాటలు, దేశ్‌కి చాలా సంతోషం కలిగించాయి.

కాని విలియం తర్వాత అన్న మాటలకి దేశ్ కాస్తగా నొచ్చుకొన్నాడు.

"ఈ స్ప్రేకి ఆసియా దేశాల్లో చాలా గిరాకీ ఉంటుంది. ఓసారి మార్కెట్ స్థిరపడ్డ తర్వాత, ముంబయ్‌లోని ఓ ఫార్మస్యూటికల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని మీ దేశంలో కూడా ఆ తయారీకి ఏర్పాట్లు చేసే ఉద్దేశ్యంలో ఉంది కంపెనీ బోర్డు....."

దేశ్ మౌనంగా ఉండిపోయాడు.

విలియం తన ధోరణిలో చెప్పుకొంటూ పోయాడు.

"అంతే కాదు, నీకో మంచి వార్త. ఆ ముంబయ్ కంపెనీతో ఒప్పందాలలో ఓ షరతు వాళ్ళ పరిశోధనాశాఖకి, నిన్ను అధిపతిగా నియమించడం – ఆ కంపెనీలోని యితర ఉద్యోగుల జీతాలతో సంబంధం లేకుండా నీకు అమెరికా ప్రమాణాలతో జీతం యివ్వడం! లక్కీ ఫెలోవి!"

దేశ్ ముఖంలో మళ్ళీ సంతోష ఛాయలు చోటుచేసుకున్నాయి.

"అన్నట్లు మరోమాట. నా కజిన్ 'విండీ' నీ కోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తూ ఉంటుంది. ఇప్పట్నుంచే మేరేజ్ కోసం ఏర్పాట్లు చేస్తోందన్న సంగతి నీకు తెలుసు. ఈ వివాహానికి మీ పెద్దవాళ్ళు ఒప్పుకోరనుకుంటాను. ఇంతకీ మీ వాళ్ళకీ సంగతి తెలుసా?" – విలియం ప్రశ్నించాడు.

"ఇంతవరకూ మా అన్నయ్య కొక్కడికే తెలుసు. నేను వెళ్ళగానే మా తల్లిదండ్రులకి నేనూ, అన్నయ్యా కలిసి నచ్చ చెప్తాం. కాస్త సంస్కృతీ, అదీ యిదీ అని గోల పెట్టినా, అనంగీకారం తెలిపేటంత విద్యావిహీనుడు కాదు మా తండ్రి. ఒకవేళ కాదంటే కూడా, నేను ఖాతరు చెయ్యదలచుకోలేదు. విండీకి, నాకూ మేరేజి ఇక్కడే తథ్యం!" అన్నాడు దేశ్ నవ్వుతూ.

బోయింగ్ విమానం కూడా చాలా నెమ్మదిగా నడుస్తున్నట్టనిపించింది దేశ్‌కి. చివరికి ఎలాగైతేనేం ముంబయ్–హైదరాబాద్–విజయవాడల మీదుగా స్వగ్రామం చేరుకున్నాడు. తెచ్చిన బహుమతులు చూసి అందరూ సంతోషించారు. అన్న కూతురు, దేశ్‌కి స్వాగతం పలుకుతూ ఆంగ్ల, తెలుగు దినపత్రికలలో వేయించిన ప్రకటనలను చూపించింది. దేశ్ వారి అభిమానానికి చిన్నగా నవ్వుకొన్నాడు.

నాలుగైదు రోజులు సరదాగా గడిపిన తర్వాత, అన్న సహాయంతో పెళ్ళి సంగతి కదిపాడు. తల్లిదండ్రులు కాస్త గింజుకొన్నా ఒప్పుకోక తప్పింది కాదు. ముంబయ్‌లో ఉంచడానికి వాళ్ళ కంపెనీ వాళ్ళాలోచిస్తున్నారని చెప్పగానే సంతోషించారు. అంతకు రెండేళ్ళ క్రితమే కొడుకు దగ్గరకు వెళ్ళాలంటే ఉండాలి కదా అని, పాస్ పోర్టులు ఏర్పాటు చేసుకొని ఉన్న తల్లిదండ్రులకి వెంటనే వీసా ఏర్పాట్లు చేసి, తిరుగు ప్రయాణంలో తనతో తీసుకుపోయాడు, వివాహం వాళ్ళ సమక్షంలో లక్షణంగా జరగాలనే ఉద్దేశ్యంతో.

'హ్యూస్టన్' హాబీ యింటర్నేషనల్ విమానాశ్రయంలో తల్లిదండ్రులతో దిగిన దేశ్‌కి విలియం స్వాగతం పలికాడు.

"నీ కారు డ్రైవ్ చేసుకొని వచ్చాను. ఎల్లో పార్కింగ్ లాట్‌లో పదో వరసలో అయిదోది. తాళాలివిగో. నీ అపార్టుమెంట్‌ని శుభ్రం చేయించి, కావల్సినవన్నీ అమర్చాను. ఈ రోజు

విశ్రాంతి తీసుకుని రేపురా. ఛైర్మన్ నీ కోసం ఎదురు చూస్తున్నాడు. నేనో టాక్సీ తీసుకొని లేబ్‌కి వెడ్తాను. ఈ లోపుగా ఏదైనా అవసరం వస్తే ఫోన్ చెయ్యి."

దేశ్ చెవులు విలియమ్ మాటలు వింటున్నా, కళ్ళు మట్టుకు విండీ కోసం వెదుకుతున్నాయి.

విలియం దేశ్ కళ్ళలోకి చూస్తూ, "కారు గ్లవ్ కంపార్ట్‌మెంట్‌లో విండీ నీ కివ్వమని యిచ్చిన ఉత్తరం ఉంది. తీసి చూడు" అన్నాడు. తర్వాత ఓ టాక్సీ కోసం చెయ్యెత్తాడు.

తల్లిదండ్రుల్ని అక్కడే ఉండమని చెప్పి, దేశ్ పార్కింగ్ లాట్‌లో తన కారు దగ్గరకు వెళ్ళి, డోర్ తీసి, స్టీరింగ్ ముందర కూర్చుని, గ్లవ్ కంపార్ట్‌మెంట్‌లో ఉన్న కవరు తీసి, అందులో ఉన్న కాగితం తీసి చూశాడు. అదో ఫాక్స్ మెసేజ్. దేశ్ అన్న నెల రోజుల క్రితం పంపింది. అది నెల రోజుల క్రితం దక్కన్ క్రానికల్‌లో తనకి స్వాగతం పలుకుతూ తమ కుటుంబ సభ్యులు వేయించిన ప్రకటన కాపీ. తనకి అన్న కూతురు చూపించిందే. మెసేజ్ క్రింద, విండీ దస్తూరీతో వ్రాసిన వాక్యాలు.

మొత్తం ఫాక్స్ మెసేజ్‌ని ఒకటికి రెండుసార్లు విభ్రమంతో చదివాడు.

అమెరికాలో అయిదేళ్ళుగా ఉద్యోగం చేస్తూ, వెళ్ళిన తర్వాత మొదటిసారిగా స్వదేశం విరామం కోసం వస్తున్న భరతాల దేశ్ కుమార్‌కి, అతని కుటుంబ సభ్యులం స్వాగతం పలుకుతున్నాం. తాత : బి. సోమనాథం, నాయనమ్మ : బి. సోమిదేవమ్మ, తండ్రి : బి. రాజశేఖర్, తల్లి : బి. రాధారాణి, అన్నా వదినలు : బి. రాంబాబు, బి. శ్రావ్య, బి. సోమ్, బి. అనూహ్యా, బి. అఖిల్, బి. నిర్మల; బి. నిఖిల్, బి. వసంత, తమ్ముళ్ళు : బి. ఆనంద్, బి. శ్రవణ్, అక్కా బావలు : వై. కరుణ, వై. రాజా, ఆర్. అరుణ, ఆర్. యశ్వంత్, చెల్లెళ్ళు : బి. స్రవంతి, బి. శోభన, సంతాన గోపాలపురం, ఎ.పి. ఇండియా.

డియర్ దేశ్,

నీకు వీడ్కోలు చెప్పి విమానాశ్రయంలోంచి బయటకు వస్తోంటే, నీ స్టెనో హడావిడిగా లోపలికి వస్తూ ఎదురైంది. నీకు ఇండియా నుంచి స్వాగతం పలుకుతూ లేబ్‌కి ఫాక్స్ మెసేజ్ వచ్చిందనీ, దాన్ని నీ కిద్దామని హడావుడిగా వచ్చాననీ చెప్పింది. నువ్వు విమానం ఎక్కేసిన సంగతి చెప్పేసరికి, ఆ మెసేజ్ నా చేతిలో పెట్టి తను వెళ్ళిపోయింది. అదే ఈ పై మెసేజ్. దాని క్రిందే ఈ వాక్యాలు వ్రాస్తున్నాను.

నీ కుటుంబ సభ్యులింత మందని నువ్వెప్పుడూ నాకు చెప్పనూ లేదు. నేను ఊహించనూ లేదు! మీ దేశంలో కుటుంబ సభ్యుల మధ్య అనురాగాలూ, ఆప్యాయతలు చాలా ఎక్కువనీ, సమర్థులు అసమర్థ సభ్యుల బాధ్యతలు స్వీకరిస్తారని నీ నోటమ్మటే చాలామార్లు చెప్పావు.

నువ్విక్కడ మా దేశంలో ఉంటే ఉధృతం కాస్త తక్కువగా ఉంటుందేమో కాని, మొత్తానికి మా దేశంలో ఉన్నా, మీ దేశం ముంబయ్‌లో ఉన్నా, నీ మీద నీ కుటుంబ సభ్యుల ఒత్తిడి చాలా ఉంటుంది. ఏడాదికోసారి 'థాంక్స్ గివింగ్ డే' నాడు తప్ప కలుసుకోని మా కుటుంబాల సంస్కృతికీ, అనునిత్యమూ అనుబంధాల బాధ్యతతలతో సతమతమయ్యే మీ సంస్కృతికీ చాలా వ్యత్యాసముంటుంది. అందులోనూ, 'నేనూ, నా భర్తా, నా పిల్లలూ' అనే స్త్రీ సహజమైన స్వార్థానికి అమెరికన్ స్త్రీ కూడా అతీతురాలు కాదు.

అందుకనే, నీ కుటుంబ సభ్యుల సంఖ్య చూసి నేను ఆలోచనలో పడ్డాను. మనం

స్నేహితులుగానే ఉండడం మంచిది.

- విండీ

దేశ్ దాన్ని ముక్కలు ముక్కలుగా చింపి, కారు దిగి డస్ట్‌బిన్‌లో పడేసి, తిరిగి కారెక్కి స్టార్టు చేశాడు.

రెండు రోజుల తర్వాత, దేశ్ తల్లి సంకోచిస్తూనే అడిగింది.

"ఏరా, దొరసాని కోడల్ని ఎప్పుడు చూపిస్తావు?"

తండ్రి కూడా అదే మాటన్నాడు.

"లేదు నాన్నగారూ, మీరిద్దరూ ముందర అభ్యంతరం తెలిపి తర్వాత అంగీకరించినా, నేనూ ఆలోచనలో పడ్డాను. ఎంతనుకొన్నా మన సంస్కృతులు కలవ్వు. అందుకనే నేనీ పెళ్ళి చేసుకోవట్లేదు!"

దేశ్ మాటలు విని, నిజానికి వాళ్లిద్దరూ చాలా సంతోషించారు.

దేశ్ తల్లి మట్టుకు, "పాపం ఆ పిల్ల...?" అంటూ మధ్యలో ఆపేసింది.

"అమ్మా. అమెరికన్ సంస్కృతిలో భగ్న ప్రేమికులనేవారు చాలా అరుదు. వాళ్ళు ప్రేమని సీరియస్‌గా తీసుకోరు!" అన్నాడు దేశ్ ముఖం మీద నవ్వు పులుపుకుంటూ, మనసులో బాధ దాచుకొంటూ. తన ప్రేమ భగ్నమవడానికి కారణం తల్లిదండ్రులేనని చెప్పగల ధైర్యం లేకపోయింది దేశ్‌కి.

"నిన్ను ఇండియాలో పోస్టు చేద్దామనుకొంటున్నాం. నువ్వే రకమైన రీసెర్చి పథకాలు చేబట్టదల్చుకొన్నావు?" ఛైర్మన్, తన ఛాంబర్స్‌లో దేశ్‌ని ప్రశ్నించాడు.

"కాలి బొటన వ్రేలి మీద జల్లితే, కడుపులు రాని 'స్ప్రే' కనిబెట్ట దల్చుకొన్నాను!" అన్నాడు దేశ్.

ఛైర్మన్ తెల్లబోయాడు.

**ఉపసంహారం :**

"దేశ్ జన విస్తరణ తగ్గించే స్ప్రే కనుక్కోవాలని పట్టుదలగా ఉన్నాడు. అతడు దాన్ని సాధిస్తాడు కూడాను. ఆసియా దేశాల్లో జన విస్తరణ తగ్గిపోతే అవి ఆర్థికంగా అభివృద్ధి పొందుతాయి. అది మనకి మంచిది కాదు. ఈ పరిస్థితుల్లో ఏం చేద్దాం?" ఛైర్మన్ బోర్డు మెంబర్లని అడిగాడు.

"అతణ్ణి ఇండియాలో పోస్టు చేస్తే, స్వతంత్రంగా వ్యవహరించడానికి సావకాశం ఎక్కువ. అందుకని అతణ్ణి యిక్కడే మరింత జీతం యిచ్చి ఉంచటం మంచిది!" మెంబర్ ఫైనాన్స్ అన్నాడు.

"అతన్ని ఆ పరిశోధన నుంచి తప్పించడం శాస్త్ర దృష్ట్యా మంచిది కాదు. అతనికి కావలసినవన్నీ ఘనంగా యిద్దాం. అతను విజయం సాధిస్తే, ఆ ప్రోడక్టు మన అధీనంలోనే ఉండిపోయేటట్టు చూద్దాం. ఈ లోపుగా, కాలిబొటన వ్రేలి మీద జల్లితే కవల పిల్లలు పుట్టే 'స్ప్రే'ని దేశ్‌కి తెలియకుండా, మన అలాస్కా లేబ్‌లో పరిశోధించడానికి ఆస్ట్రేలియా కుర్రాడు రాబర్ట్‌ని నియమిద్దాం. అతనూ చాలా తెలివైనాడు" అన్నాడు మెంబర్ రీసెర్చ్.

"ఓ.కె. బడ్జెట్ గ్రాంటెడ్!" అంది బోర్డు ఏక కంఠంతో. ●